
పట్టదారు పాస్‌పుస్తకం

అందేదెప్పుడో..?



అన్ని పథకాలకు ప్రామాణికం

ఉమ్మడి జిల్లాలో సగటున రోజుకు రిజిస్ట్రేషన్లు: 700 వరకు

ప్రభుత్వానికి ప్రతిరోజు వస్తున్న ఆదాయం: రూ.3 కోట్లు

పాస్‌పుస్తకాలకు ఎదురు చూస్తున్న వారు: 50 వేల మంది

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ధరణి వెబ్ సైట్ ద్వారా ప్రతిరోజూ తహసీల్ కార్యాలయాల్లో పదుల సంఖ్యలో భూరి జిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సాఫీగా సాగుతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు అందకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. దాదాపు మూడు నెలలుగా ఈ పరిస్థితి నెలకొనడంతో ఆందోళన చెందుతున్నారు. దరఖాస్తు చేసుకున్న మీసేవ కేంద్రాలకు రోజూ వెళ్తూ రిజిస్ట్రేషన్ జరిగిందా.? అసలు పట్టాదారు పాసు పుస్తకం వస్తుందా.? రాదా? అని ఆరా తీస్తున్నారు.

రుణమాఫీ, పంట రుణాలు, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, రైతు బీమా, విత్తనాలు, ఎరువుల రాయితీలు, యంత్రపరికరాలు, పాడి పశువులు పంపిణీకి పట్టాదారు పాసు పుస్తకమే ప్రామాణికం. ఉద్యాన పంటలకు ఉపయోగించే బిందు, తుంపర, పాలీ హౌజ్‌లకు సంబంధించి సామగ్రి రాయితీపై మంజూరుకు పాస్‌పుస్తకం ఆధారంగా చూపించాల్సి ఉంటుంది.

ప్రక్రియ ఇలా..

- రిజిస్ట్రేషన్లకు ముందు క్రయ విక్రయదారులు మీసేవలో స్లాట్ బుక్ చేయాలి. ఆ సమయానికి తహసీల్ కార్యాలయానికి హాజరై రిజిస్ట్రేషన్ ప్రక్రియకి రుసుములు చెల్లించాలి. ఆ తర్వాత నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేసి అంతర్జాలంలో సీసీఎల్‌ఏ(భూ పరిపాలన ముఖ్య కమిషనర్) కార్యాలయానికి దస్తావేజు పంపిస్తారు. అక్కడికి వెళ్లిన తర్వాత ప్రభుత్వ అనుమతి ఉన్న ప్రింటింగ్ ప్రెస్ ద్వారా పట్టాదారు పాస్ పుస్తకంలో వివరాలన్నీ నమోదైన తర్వాత నేరుగా తపాలా శాఖ ద్వారా కొనుగోలుదారు చిరునామాకు చేరుతుంది.
- వ్యవసాయ భూముల క్రయవిక్రయాలు మొత్తం తహసీల్ కార్యాలయంలోనే జరుగుతాయి. రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో భాగంగా ప్రభుత్వానికి ఒక్కో ఎకరా మీద రిజిస్ట్రేషన్లు, స్టాంపు డ్యూటీ ఇతరత్రా అన్ని రుసుములు కలిపి గరిష్ఠంగా రూ.20వేల వరకు రైతులు చెల్లించాల్సి వస్తుంది.
- గతంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసిన వెంటనే పాస్‌పుస్తకం ఉన్నవారికైతే అందులోనే క్రయ, విక్రయాల వివరాలు కొత్తవి నమోదు చేసి ప్రింట్ తీసి అప్పటికప్పుడే అందించేవారు.
- ధరణిలో రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన పక్షం రోజుల్లోపు పట్టాదారు కొత్త పాస్‌పుస్తకం రైతులకు చేరేది. ప్రస్తుత ఆలస్యానికి కొత్త పుస్తకాల కొరత కారణమని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. మూడు నెలలుగా ఉమ్మడి జిల్లాలో దాదాపు 50 వేల మందికి కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ కావాల్సి ఉంది.

మంచినీటి సహాయకుల శిక్షణ ముగింపు

ప్రతి ఒక్కరూ మిషన్ భగీరథ నీటిని తాగేలా నమ్మకం పెంచాలని, ప్రజలకు సురక్షిత నీరు అందించడం మన బాధ్యతని మిషన్ భగీరథ క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ కరుణాకర్‌రెడ్డి అన్నారు. మిషన్ భగీరథ ఆధ్వర్యంలో నాలుగురోజులుగా సాగిన మంచినీటి సహాయకుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి నెలలో మొదటి రోజు, 11వ, 22వ రోజు క్రమం తప్పకుండా ట్యాంకులను శుభ్రం చేసి, క్లోరినేషన్ పరీక్షల వివరాలు నమోదు చేయాలని, అనంతరం రిజిస్టర్‌లో స్థానికులతో సంతకాలు తీసుకోవాలని, దీంతో వారిలో భగీరథ నీరు సురక్షితంగా ఉంటుందన్న నమ్మకం పెరుగుతుందన్నారు. ఈఈ శాంతికుమారి, యాదయ్య, డీఈఈ నరేందర్, ఏఈ షఫిముద్దిన్, రవి, సంపత్ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, నల్గొండ గ్రామీణం



శిక్షణ అనంతరం ధ్రువపత్రాలు అందుకున్న మంటినీటి సహాయకులతో ఎస్ఈ కరుణాకర్‌రెడ్డి

యువత చేతిలోనే దేశ భవిత



నృత్య ప్రదర్శనలో విద్యార్థిని..

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: యువత చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచందర్‌రావు సూచించారు. శుక్రవారం నల్గొండ పట్టణంలోని కేవీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని, వారి చేతిలోనే దేశ భవిత ఆధారపడి ఉందన్నారు.

- డీఐఈవో దస్రునాయక్ మాట్లాడుతూ.. పోటీల్లో పాల్గొనడం ద్వారా తమలోని ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. జిల్లాస్థాయి యువజనోత్సవాలు నల్గొండలో నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.



నల్గొండ: యువజనోత్సవాలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ పూర్ణచందర్‌రావు, డీఐఈవో, తదితరులు

- బాలుర, వొకేషనల్ కళాశాలల ప్రిన్సిపాళ్లు సీబా, అధ్యాపకులు శివకోటి, నరసింహ, శోభారాణి, హేమ్లానాయక్, వేణుగోపాల్, విక్రమ్, జ్యోతి, డీవైఎస్‌వో కార్యాలయ సూపరింటెండెంట్ కిరణ్ కుమార్, నజీర్ పాల్గొన్నారు.



లక్ష్మణ్ బాపూజీ జయంతి

కలెక్టరేట్‌లో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఏవో మోతీలాల్, సిబ్బంది నివాళి అర్పించారు. – న్యూస్‌టుడే, నల్గొండ విద్యావిభాగం

జిల్లాలో కొత్తగా ఐదు బ్యాంకులు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాసరెడ్డి

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో జిల్లాలో మరో ఐదు బ్యాంకులను కొత్తగా ప్రారంభించనున్నట్లు డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాసరెడ్డి తెలిపారు. డీసీసీబీ సర్వసభ్య సమావేశం ఛైర్మన్ కుంభం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సాగర్‌లోని విజయవిహార్‌లో నిర్వహించారు.

- సమావేశ అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కొత్తగా ఐదు బ్యాంకులను ఏర్పాటు, ఎన్ఎల్ఎం పథకంగా గొర్రెలు, కోళ్ల పెంపకానికి యూనిటుకు 50 శాతం రాయితీ ద్వారా రుణాలు ఇవ్వాలని, ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు టర్నోవర్‌ను రూ.3వేల కోట్లు, లాభాలను రూ.50 కోట్లకు పెంచడానికి కృషి చేయాలని తీర్మానం చేసినట్లు తెలిపారు.
- జిల్లాలో నేషనల్ హార్టికల్చర్ బోర్డు ద్వారా పండ్ల తోటలు, కూరగాయలు పెంచడానికి 30 శాతం రాయితీతో రూ.30 లక్షల వరకు రుణాలు అందజేయాలని నిర్ణయించినట్లు ఆయన వివరించారు. వైస్‌ఛైర్మన్ దయాకర్‌రెడ్డి, సీఈవో శంకర్‌రావు, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగురాలిపై బాలుడి లైంగికదాడి

వేములపల్లి: పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. ఓ మానసిక దివ్యాంగురాలిపై అత్యాచారం చేసి.. అనంతరం గర్భం దాల్చగా ఆ యువతికి గర్భవిచ్ఛిత్తి మాత్రలు వేసి గర్భస్రావమయ్యేలా చేసిన ఓ బాలుడి ఉదంతం నల్గొండ జిల్లా మిర్యాలగూడ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికుల వివరాల మేరకు.. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలుడు(17) అదే గ్రామానికి చెందిన తన ఇంటికి సమీపంలో ఉన్న మానసిక దివ్యాంగురాలి (21)కి మాయమాటలు చెప్పి.. ఇంట్లో ఎవరూలేని సమయంలో శారీరక వాంఛ తీర్చుకున్నాడు. ఇలా పలుమార్లు జరగగా యువతి గర్భం దాల్చింది. విషయం తెలుసుకున్న యువకుడు దివ్యాంగురాలిని పెళ్లి చేసుకోవాల్సి వస్తుందేమోనని భయపడి, తన తండ్రి సాయంతో గర్భవిచ్ఛిత్తి మాత్రలు తెచ్చి దివ్యాంగురాలితో గత నెల 26న మింగించాడు. దీంతో తీవ్ర రక్తస్రావమై అపస్మారక స్థితిలో యువతి పడిపోగా. . సాయంత్రం పని నుంచి వచ్చిన యువతి తల్లి వెంటనే తన కుమారుడి సాయంతో మిర్యాలగూడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సనందించారు. అనంతరం యువతి తల్లి ఆగస్టు 30న బాలుడిని.. అతని తండ్రిని న్యాయం కోసం నిలదీయడానికి వెళ్లగా. . వారు ఆమెను, తన కుమార్తెను చంపుతామని బెదిరించటంతో ఈనెల 20న పోలీసులను ఆశ్రయించింది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోకపోవటంతో.. శుక్రవారం కుల సంఘాలను ఆశ్రయించగా విషయం బయటికి వచ్చింది. తమ కుమార్తెపై జరిగిన అత్యాచారం గురించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితురాలి తల్లి ఆరోపించింది. ఈ విషయమై సీఐ వీరబాబును వివరణ కోరగా.. కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, గర్భవిచ్ఛిత్తికి మందులు ఎక్కడ కొనుగోలు చేశారు.. ఎవరు సహకరించారనే కోణంలో పరిశీలిస్తున్నామని తెలిపారు.

యువ హృదయాలు ఉప్పొంగె..!

నల్గొండ జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో నల్గొండ పట్టణంలోని కేపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జిల్లాస్థాయి యువజనోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు అధికారులు పాల్గొని క్రీడల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఆయా కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు.
– న్యూస్‌టుడే, నల్గొండ టౌన్, ఈనాడు, నల్గొండ


ఉల్లాసం.. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థుల నృత్యం


కోలాటం.. దేవరకొండ గురుకుల కళాశాల విద్యార్థుల ప్రదర్శన


దరహాసం.. దేవరకొండ కేజీబీవీ విద్యార్థినుల ప్రదర్శన


ఉత్సాహం.. పాల్గొన్న విద్యార్థులు

నాటి ప్రతిభకు తార్కాణం..
నేటికీ చెక్కుచెదరని వైనం

నాగార్జున సాగర్ ఎడమ కాల్వకు సూర్యాపేట జిల్లా శివారు కాగితరామచంద్రాపురం సమీపంలో ఖమ్మం జిల్లా నాయకన్‌గూడెం చేరువలో నిలిచింది ఈ రోడ్డు వారధి. ఇక్కడ సాగర్ ఎడమ కాల్వ కట్ట రెండు వైపుల నుంచి వచ్చే రహదారి కలిసేలా వారధి నిర్మాణం చేపట్టారు. పైనుంచి నాలుగు వైపుల రహదారి, కింద నుంచి సాగర్ నీరు ఖమ్మం జిల్లాకు ప్రవహించేలా వారధి నిర్మాణం చేపట్టారు. ఇక్కడ నాలుగు రహదారులు కలుస్తుండటంతో వారధికి ఉన్న రక్షణ గోడలను గుర్తించేలా రకరకాల రంగులు వేశారు. దీంతో దీనికి రంగుల వారధిగా పేరు వచ్చింది. ఈ కట్టడం నేటికీ చూపరులను ఎంతో ఆకర్షిస్తుంది. కాల్వ పైనుంచి రెండు రహదారులు వెళ్లడం, కింద నుంచి నీరు ప్రవహించే తీరు దర్శనీయం ప్రాంతంగా గుర్తింపు తెచ్చింది.



–నడిగూడెం, కోదాడ, న్యూస్‌టుడే:

ఆడాలనే ఆసక్తి.. అడుగెయ్యలేని దుస్థితి

సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్: చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ప్రాణం పెరిగాడు ఆ కుర్రాడు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో సత్తా చాటాడు. తాజాగా అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం దక్కించుకున్నాడు. కానీ ఆ ఎంపికకు వెళ్లేందుకు చేతిలో చిల్లిగవ్వ లేదు. ఆడాలనే ఆసక్తి, పాల్గొనే అవకాశమున్నా ఆర్థిక స్థితి సహకరించక సతమతమవుతున్నాడు.

✦ సంస్థాన్ నారాయణపురం మండలం గుజ్జ గ్రామానికి చెందిన గోపరాజు భిక్షపతి-కవిత కుమారుడు అర్జున్ అంతర్జాతీయ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతూ క్రికెట్‌లో రాణిస్తూ పలు రాష్ట్రాల్లో జరిగిన పోటీల్లో పాల్గొంటూ ప్రతిభ చాటుకుంటున్నాడు. ఇటీవలే చెన్నై, మధ్యప్రదేశ్‌లో రాష్ట్రస్థాయిలో పాల్గొన్నాడు. అతని ప్రతిభను గుర్తించిన ఎన్ఎస్సీ అకాడమీ.. హైదరాబాద్‌లో ఇంటర్ నేషనల్ క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించింది. అక్కడ సత్తా చాటడంతో అండర్-19లో శ్రీలంకలోని కొలంబోలో నిర్వహించే అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు కూడా ఇచ్చారు. అక్టోబరు 20 నుంచి 29 వరకు నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొననున్నాడు.


కప్పుతో గోపరాజు అర్జున్

✦ అర్జున్‌ది నిరుపేద కుటుంబం. రెక్కాడితే కాని డొక్కాడని దుస్థితి. అక్కతోపాటు చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాడు. ఆటలో ఇక్కడి వరకు రావటానికి తల్లిదండ్రులు రూ.లక్ష వరకు అప్పు చేసినట్టు వాపోయాడు.

రోగాలు కొని తెచ్చుకుంటున్నారు..!


పంటలపై పురుగు మందులు పిచికారీ చేస్తున్న రైతు

గరిడేపల్లి, మునగాల, న్యూస్‌టుడే: మానవ శరీరం రసాయనాలతో నిండుతోంది. ఏటా రైతులు వాడుతున్న పురుగు మందుల మోతాదు రెట్టింపవడంతో మనిషి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. తెలియకుండానే రోగాలు కొని తెచ్చుకుంటున్నారు. నిబంధనలు పాటించాల్సిన రైతులు, దుకాణం యజమానులు వాటికి తిలోదకాలిచ్చేస్తున్నారు. ఇటీవలి పలు అధ్యయనాలు, సర్వేలూ ఇదే చెబుతున్నాయి.

భారీగా వినియోగం..

రైతులు సాగు చేస్తున్న పంటలో పురుగులు, తెగుళ్ల ఆశిస్తే తక్షణమే నివారించుకోవడానికి రసాయన పురుగుమందులు వాడుతున్నారు. నిదానంగా ప్రభావం చూపేవి, తక్షణమే ప్రభావం చూపేవీ రెండు రకాలు ఉన్నా.. ఎక్కువ మంది రైతులు రెండో రకానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. దాంతో పాటు కంపెనీ, శాస్త్రవేత్తలు చూపిన మోతాదుల కంటే అధనంగా వినియోగిస్తున్నారు.

◆ పంటలపై పిచికారీ చేసిన మందు 10 శాతం ఆశించిన పురుగులు, తెగుళ్లపై ప్రభావం చూపుతుండగా మిగిలిన ద్రావణం కొంత ఆవిరిగా, మరికొంత భూగర్భజలంలో, మరికొంత మనం తినే ఆహార పదార్థాలలో అవశేషాలుగా మిగిలిపోతున్నాయి. రోజు కొంత మొత్తంలో శరీరంలోకి వెళ్తుండటంతో క్రమేపీ ఏదో ఒక వ్యాధికి కారణమవుతున్నాయి.

◆ వాస్తవానికి ఆరోగ్య మంత్రిత్వ శాఖ మానవ ఆరోగ్యంపై తక్కువ ప్రభావం చూపే మందులను సిఫారస్ చేస్తారు. అందుకు భిన్నంగా రైతులు సిఫారస్ కంటే ఎక్కువ మోతాదులో వాడుతున్నారు.

వివిధ కారణాలతో..

పిచికారీ చేసిన తర్వాత పంట కోయడానికి కొంతకాలం వేచి ఉండాలి. వివిధ రకాల పంటలను బట్టి ఐదు రోజుల నుంచి 21 రోజుల వరకు కోయకూడదు. వాడకూడదు.

◆ అందుకు భిన్నంగా పిచికారీ చేసిన రెండు, మూడు రోజుల్లోనే కాయగూరలు కోసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. పంటలో ఏ రకమైన తెగుళ్లు, పురుగు ఆశించిందో అవగాహన లేక కంపెనీల ఏజెంట్లు ఇచ్చిన నాలుగైదు రకాల మందులు కలిపి పిచికారీ చేస్తున్నారు. వాటికి తగ్గకపోతే వారం, పది రోజుల వ్యవధిలోనే మరోసారి పిచికారీ చేస్తున్నారు.

డబ్బాలపై ఉన్నా..

పురుగుమందు డబ్బాలపై విష పూరిత మందుల ప్రభావం ఎంతుంటుందో రంగుల రూపంలో ఇస్తుంటారు. ఎరుపురంగు అత్యధిక విష పూరిత మందుగా, పసుపు రంగు అధిక విష పూరితం, నీలం రంగు ఓ మోస్తరు, ఆకుపచ్చ కొద్దిపాటి విష పూరితమని ఉంటుంది. ఇవేవీ రైతులు, వ్యాపారులు, కంపెనీ ఏజెంట్లు గుర్తించరూ, పట్టించుకోరు. అందుకే అన్ని రకాల మందులను ఒకే మోతాదులో సిఫారస్ చేస్తున్నారు.



రైతులు గమనించాలి: అరిగేల కిరణ్, కేవీకే శాస్త్రవేత్త, గడ్డిపల్లి

రైతులు మోతాదు మించి పురుగు, తెగుళ్ల మందులు వాడకూడదు. తొలిదశలోనే తక్కువ రకం మందులతో అదుపులోకి తేవాలి. జీవ, వృక్ష సంబంధ మందులనే ఎక్కువగా వినియోగించాలి. అత్యవసరమైతేనే రసాయన మందులు వాడాలి.

☛ కూరగాయలు, పండ్లు ఇంటికి తెచ్చిన తర్వాత ఉప్పునీళ్లలో అరగంట నానబెట్టి తర్వాత శుభ్రమైన నీటిలో రెండు, మూడు సార్లు కడిగి వాడాలి. పై తొక్కలను తీసేయడం ద్వారా కొంతమేర అవశేషాలను తొలగించవచ్చు.

ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి


రాజపేటలో వ్యవసాయ క్షేత్రానికి రహదారి నిర్మాణ పనుల్లో ఉపాధిహామీ సాధారణ కూలీలు (పాతచిత్రం)

రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే

ట్రాన్స్‌జెండర్లు గౌరవప్రదంగా జీవించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. వారిని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో ట్రాఫిక్ వాలంటీర్లుగా నియమిస్తామని ప్రకటించగా, ప్రత్యేక వైద్య సేవలు కూడా అందుబాటులోకి రానున్నాయి. ఈ విషయమై ఉమ్మడి నల్గొండ జిల్లాలోని భువనగిరి, నల్గొండ, సూర్యాపేట జిల్లా ఆసుపత్రుల్లో త్వరలో మైత్రి ట్రాన్స్ క్లినిక్‌ల పేరిట వైద్యసేవలు అందుబాటులో తెచ్చేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. వారంలో రెండు రోజులు ట్రాన్స్‌జెండర్లకు ఓపీ సేవలు అందనున్నాయి.

✤ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ట్రాన్స్‌జెండర్లకు మనోధైర్యం కల్పించేందుకు, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఉపాధి హామీ పని కల్పించాలని భావించింది. ఈ మేరకు శాఖాపరంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి ట్రాన్స్‌జెండర్‌కు జాబ్‌కార్డు మంజూరు చేయాలని పేర్కొంది. దీనికి సంబంధించి మార్గదర్శకాలు ఇటీవలనే విడుదల చేసింది. పల్లెల్లో ట్రాన్స్‌జెండర్ల గుర్తింపు ప్రక్రియలో సంబంధిత అధికారులు నిమగ్నమయ్యారు.

✤ మరోవైపు ఎస్సీ, ఎస్టీ వర్గాల కూలీల్లో ఇప్పటి వరకు వ్యక్తిగతంగా లబ్ధిపొందిన వారి వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఓటు హక్కు కలిగిఉన్న వారు 202 మంది ఉండగా, మరికొందరు ఓటు హక్కు పొందనివారు కూడా ఉన్నట్లుగా తెలుస్తోంది. వీరిలో 18 ఏళ్లు నిండినవారికి ఉపాధి హామీ జాబ్‌కార్డును మంజూరు చేయనున్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటు హక్కు కలిగి ఉన్నవారు..

దేవరకొండ	18
నాగార్జునసాగర్	21
మిర్యాలగూడ	26
నల్గొండ	57
హుజూర్‌నగర్	17
కోదాడ	17
సూర్యాపేట	13
తుంగతుర్తి	7
ఆలేరు	19
భువనగిరి	1
నకిరేకల్	3
మునుగోడు	3

మార్గదర్శకాల్లో ముఖ్యాంశాలు ఇవీ..

☛ ట్రాన్స్‌జెండర్లకు ఆధార్ ఆధారంగా జాబ్‌కార్డు.
☛ గ్రామాల్లో ఇద్దరికంటే ఎక్కువ మంది ఉంటే గ్రూప్‌గా ఏర్పాటు.
☛ గ్రూప్ లేక వ్యక్తిగతంగా ఒకే ప్రాంతంలో పని కల్పించేలా చర్యలు.
☛ పని ప్రదేశంలో వారిపట్ల ఎలాంటి వివక్ష చూపొద్దు. ఇందుకోసం మేట్లకు అవగాహన కార్యక్రమాలు.
☛ ట్రాన్స్‌జెండర్ల సమస్యల కోసం మండల, జిల్లా స్థాయిలో నోడల్ అధికారి నియామకం.

గ్రామాల వారీగా గుర్తింపు ప్రక్రియ

– నాగిరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, యాదాద్రి భువనగిరి

జిల్లాలోని గ్రామాల్లో ట్రాన్స్‌జెండర్లను గుర్తించే ప్రక్రియ చేపడుతున్నాం. ప్రతి ఒక్కరికి జాబ్‌కార్డు మంజూరు చేస్తాం. ప్రత్యేకంగా పని కల్పించి, వసతులు సమకూర్చనున్నాం. వారిపై వివక్ష చూపకుండా ఇతర కూలీలకు పలు రకాలుగా అవగాహన కల్పించే ఏర్పాట్లు చేపడతాం.



ప్రసాద విక్రయాల్లో మార్పులు?

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో నాణ్యతా ప్రమాణాలు కలిగిన ప్రసాదాల తయారీతో పాటు, విక్రయాలలో సరికొత్త మార్పులు తెచ్చే యోచనలో దేవస్థానం ఉంది. రోజురోజుకు పెరుగుతున్న ఆదరణతో దేవుడి ప్రసాదాలను భక్తులకు సునాయాసంగా చేకూరేలా అధునాతన వనరులు కల్పించనున్నట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. ఆలయ పరిసరాలలో ఏటీఎం లాంటి ప్రత్యేక యంత్రాలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా భక్తులు తమకు కావాల్సిన ప్రసాదాల టికెట్లను డిజిటల్ పేమెంట్ చేసి, వాటిని పొందే అవకాశం త్వరలోనే అందుబాటులోకి తేనున్నారు. సదరు యంత్రాలను భక్తుల రద్దీ స్థావరాలైన హరి, హర ఆలయాలు, బస్టాండ్, వీవీఐపీ వాహనాల పార్కింగ్, కొండ కింద ఆధ్యాత్మిక వాడలోని వ్రత మండపం, పుష్కరిణి, అన్న ప్రసాదం, బస్ స్టేషన్ ప్రాంగణాల్లో కొత్త వనరుల ఏర్పాటుకు ప్రతిపాదించారు.

ఇప్పటికే.. ఒకే సముదాయంలో టికెట్ల విక్రయాలు, ప్రసాదాలను అందజేసే కౌంటర్లు ఉండేవి. సదరు కాంప్లెక్స్‌లో గజిబిజి వాతావరణం ఉండేది. ఆ విధానాన్ని మార్చి టికెట్ కౌంటర్లను ఆలయ ఈవో భాస్కర్ రావు మరో చోట ఏర్పాటు చేసిన విషయం విధితమే. విక్రయాలలో టికెట్ల కౌంటర్, ప్రసాదాలు అందజేసే కౌంటర్లు వేర్వేరుగా ఏర్పాటయ్యాయి. భక్తులకు అనుగుణంగా మరిన్ని మార్పులు రానున్నాయి.



ప్రసాద విభాగం

ప్రమాదం పేరుతో యాపిల్ పండ్లు మాయం!

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: సిమ్లా నుంచి చెన్నైకి ట్రక్కులో యాపిల్స్‌ను తీసుకెళ్తుండగా మార్గమధ్యలో ప్రమాదం జరిగిందని చెప్పి డ్రైవర్లు వాటిని మాయం చేశారు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం వద్ద ఈ నెల 23న చోటుచేసుకుంది.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ కొత్తపేట పండ్ల మార్కెట్‌లో కందగొండ దత్తాత్రేయ పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. ఆయన సిమ్లాలో భువన్‌సింగ్ అనే వ్యక్తి వద్ద ఈనెల 17న 493 బాక్సుల యాపిల్ పండ్లను కొనుగోలు చేశాడు. వీటి విలువ రూ.15.32లక్షలు ఉంటుంది. వీటిని చెన్నైలో విక్రయించేందుకు కంటైయినర్ ట్రక్కులో తీసుకెళ్తున్నాడు. రవాణా చేసేందుకు ట్రాన్సుపోర్టు కంపెనీకి రూ.1,32,200 చెల్లించాడు. కంటైనర్‌లో పండ్లను తీసుకొని బయలుదేరిన డ్రైవర్లు ఈనెల 23న చౌటుప్పల్ మండలం దండుమల్కాపురానికి చేరుకున్నారు. హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై దండుమల్కాపురం వద్ద ప్రమాదం జరిగిందని, లారీ బోల్తా పడటంతో యాపిల్ పండ్లను ఎత్తుకెళ్లారని డ్రైవర్లు భువన్‌సింగ్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. పండ్ల వ్యాపారితో పాటు భువన్‌సింగ్ వచ్చి చూడగా కంటైనర్ ట్రక్కుకు ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. అక్కడ ఇద్దరు డ్రైవర్లు కూడా కనిపించకుండా పారిపోయారు. వారికి ఫోన్ చేస్తే చరవాణి స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో ఇద్దరు డ్రైవర్లు వీటిని మాయం చేసి ఉంటారని అనుమానంతో పండ్ల వ్యాపారి దత్తాత్రేయ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై యాదవరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ శుక్రవారం తెలిపారు.

కూచిపూడి నాట్య ధీరుడు..
ఈ కుర్రోడు!

తిరుమలగిరి సాగర్, న్యూస్‌టుడే: తపన ఉండాలే కానీ మనిషనుకుంటే ఏదైనా చేసేయగలడు. వాటికనుగుణంగానే ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే తమకంటూ ఓ రంగంపై ఆసక్తి, పట్టుదలను ఏర్పరచుకుంటారు. తల్లిదండ్రులు, గురువులు వాటిని గుర్తించి తగు శిక్షణ ఇప్పిస్తే ఆ రంగంలో ఆరితేరుతారు. ఇలా తమలోని అభిరుచిని పసిగట్టిన పోషకులు అందించిన ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని జిల్లా, రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయిలో ప్రదర్శనలు చేసి ప్రశంసలతో పాటు అవార్డులు, రివార్డులు పొందుతున్నాడు మండలంలోని నాగార్జునపేటతండాకు చెందిన ఆంగోతు శివకుమార్.

ఇష్టం పెరిగిందిలా..

☛ ఆంగోతు బిక్కు, శాంతి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు శివకుమార్. తన ప్రాథమిక విద్య నాగార్జునసాగర్‌లో పూర్తిచేశాడు. అక్కడ జరిగే సంస్కృతి కార్యక్రమాలలో నృత్యాలను చూసి నాట్యమంటే ఇష్టం పెంచుకున్నాడు.
☛ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నాగార్జునసాగర్‌లోని నాట్యశిక్షకుడు దస్తగిరి వద్ద కూచిపూడిలో శిక్షణ తీసుకున్నాడు. 2006లో హాలియాలోని సైన్స్ ఫేర్ కార్యక్రమంలో అప్పటి కలెక్టర్ ముందు కూచిపూడి నృత్యం చేసి ప్రశంసలు పొందాడు.
☛ తన తండ్రి వ్యవసాయ కూలీ అయినా శివకుమార్ కోసం హైదరాబాద్ వెళ్లి ఆటో నేర్చుకుని కుటుంబాన్ని పోషించుకుంటూ కుమారుడిని సికింద్రాబాద్‌లోని రాంకోటిలో శ్రీత్యాగరాజ మ్యూజిక్ కళాక్షేత్రంలో చేర్పించారు.
☛ అక్కడ శివకుమార్ ప్రతిభను గుర్తించిన భరతనాట్య కళాకారుడు విజయ్ సొంత ఖర్చులతో చెన్నై వెంకట చినసత్యం కూచిపూడి ఆర్ట్ అకాడమీలో చేర్పించారు.
☛ అక్కడ వెంపటి శ్రీమోయి వద్ద ఏడాదిన్నర పాటు కూచిపూడిలో శిక్షణ తీసుకున్నాడు. నృత్యంలో అందరినీ ఆకట్టుకునే విధంగా భంగిమలతో తన కళ్లతోనే భావాలను పలికిస్తూ తన నృత్యంతో కట్టిపడేసేవాడు.
☛ అక్కడి నుంచి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లోని శివాన్స్ డాన్స్ అకాడమీని ఏర్పాటు చేసి నాలుగు అకాడమీలలో 200పైగా విద్యార్థులకు కూచిపూడిలో శిక్షణ ఇస్తున్నాడు. దీనితో పాటు చిరంజీవి నటించిన ఆచార్య మూవీలో హీరోయిన్ కాజల్, సంగీతకు కూచిపూడి నాట్యంలో మెలకువలు నేర్పించారు.


నాట్యం చేస్తున్న శివకుమార్

అవార్డులు, ప్రశంసలు..

◆ సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో నిర్వహించిన ప్రదర్శనలో నాట్య చిరోదామి, వరంగల్‌లో నిర్వహించిన పోతన శక్తిపీఠంలో మొదటి బహుమతి రాధేశ్యాం మాష్టారు చేతుల మీదుగా నాట్య కళాధీర అవార్డు, నాట్య నర్తక, నాట్య మయూరి అవార్డులను గెలుపొందాడు.
◆ శ్రీశైలం, విజయవాడ కనకదుర్గ దేవాలయం, శ్రీకాళహస్తి, మహారాష్ట్రలోని వరలక్ష్మి దేవాలయం, హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, శ్రీత్యాగరాజ గాన సభ, తెలంగాణ ప్రభుత్వ వజ్రోత్సవ కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు ప్రదర్శనలు ఇచ్చి ప్రశంసలు పొందారు.

బిస్మిల్లాఖాన్ అవార్డు సాధిస్తా..

– ఆంగోతు శివకుమార్, నాగార్జునపేట, తిరుమలగిరిసాగర్

ఎప్పటికైనా మంచి గురువుగా, నాట్యకళాకారుడిగా పేరు సంపాదించి బిస్మిల్లాఖాన్ అవార్డును సాధిస్తా. ప్రభుత్వ నాట్య కళాశాలలో గురువుగా విద్యార్థులకు కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇవ్వాలని భావిస్తున్నాను.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

మునుగోడు, న్యూస్‌టుడే: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనగా ఇద్దరు మిత్రులు మృతి చెందారు. ఈ ఘటన నల్గొండ జిల్లా మునుగోడు మండలం చొల్లేడు గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడుకు చెందిన నాగరాజు(19) ద్విచక్ర వాహనంపై చొల్లెడు గ్రామానికి వెళ్లి వస్తున్నాడు. అదే సమయంలో మర్రిగూడ మండలం నర్సిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన కె.రామాంజనేయులు(23) తన స్నేహితుడు బొమ్మగోని నరేశ్‌తో కలిసి నల్గొండకు వెళ్లి వస్తున్నారు. ఈ రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన నాగరాజు, రామాంజనేయులు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నల్గొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


నాగరాజు


రామాంజనేయులు

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00


సందర్శనకు వచ్చిన వివిధ దేశాల ప్రతినిధులు

శిక్షణ అధికారుల బృందం సందర్శన

కట్టంగూరు, న్యూస్‌టుడే: భారత ప్రభుత్వ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మేనేజ్' కార్యక్రమంలో భాగంగా వ్యవసాయంపై అధ్యయనానికి వచ్చిన ఆఫ్రికా ఖండం, వ్యవసాయ రంగానికి చెందిన అధికారుల బృందం.. మండలంలోని అయిటిపాముల రైతు ఉత్పత్తి దారుల సంఘ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించింది. కేంద్రంలోని నిమ్మకాయల గ్రేడింగ్ యంత్రాన్ని, నిమ్మకాయలతో ఒరుగుల తయారీ విధానాన్ని పరిశీలించారు. సోలార్‌తో పనిచేసే నిల్వ కేంద్రాన్ని, నర్సరీలో కూరగాయల మొక్కల పెంపకాన్ని చూశారు. కేంద్రం పనితీరును, జరుగుతున్న అభివృద్ధిని, భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలను అక్కడి సలహాదారులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, ఫౌండేషన్ వ్యవస్థాపకులు కోణం సందీప్ వివరించారు. రైతుల అభివృద్ధికి కోణం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృత్రిమ మేధస్సును మేళవించి 'కృషి' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సందీప్ తెలిపారు. కేంద్రం ఛైర్మన్ సైదమ్మ పాల్గొన్నారు.

నల్గొండ
• నల్గొండ • మునుగోడు • నకిరేకల్

నేడు జాతీయ మెగా లోక్‌అదాలత్

నల్గొండ లీగల్, న్యూస్‌టుడే: జాతీయ మెగా లోక్ అదాలత్‌ను జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు శుక్రవారం తెలిపారు. రాజీ మార్గమే రాజమార్గమని, శాంతియుత జీవనానికి చట్టాలను అనుసరించడం మంచిదని పేర్కొన్నారు. కక్షిదారుల సౌకర్యార్థం త్వరితగతిన కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు, ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా దాదాపు నాలుగు వేల కేసులను రాజీకి తగిన వాటిని గుర్తించినట్లు చెప్పారు. దీంట్లో సివిల్, క్రిమినల్, మోటారు వాహన ప్రమాద, చెక్‌బౌన్స్, భూ వివాదాలు తదితర కేసులను పరిష్కరిస్తారని, సంబంధిత కోర్టుల పరిధిలో న్యాయసేవాధికార సంస్థను సంప్రదించవచ్చని సూచించారు.

స్వచ్ఛతా హీ సేవా చిత్రలేఖన పోటీలు

నకిరేకల్, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పుర సంఘం ఆధ్వర్యంలో నకిరేకల్ జడ్పీ ఉన్నత, గౌతమి ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను శుక్రవారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పుర కమిషనర్ డి.బాలయ్య, జడ్పీ పాఠశాల హెచ్‌ఎం కె.రాములు, గౌతమి పాఠశాల ప్రిన్సిపల్ శంకర్, పుర పర్యావరణ ఇంజినీర్ నాగరాజు పాల్గొన్నారు.

చండూరు: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు స్థానిక తహసీల్ కార్యాలయ ఆవరణలో శుభ్రం చేశారు. నిర్మలాదేవి, తదితరులు పాల్గొన్నారు.

నేల వాలిన ఆశలు



లింగాలగూడెంలో(దొరెపల్లి) నేలవాలిన వరి చేను


ప్రకృతి వైపరీత్యాలు అన్నదాతను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలులతో చేతికొచ్చిన పంటలు నేలపాలవుతున్నాయి. ఆరుగాలం కంటికి రెప్పలా కాపాడుకున్న వరి నేలరాలిపోవడంతో రైతన్నలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. మండలంలో లింగాలగూడెం, జి.యడవల్లి, ఏమిరెడ్డి గూడెం తదితర గ్రామాల్లో వరి పంట నేలవాలింది. మరో పదిరోజుల్లో కోత దశకు వచ్చిన పంట నేలవాలటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటను కాపాడుకోవటం కోసం వారు నానా ఇక్కట్లు పడుతున్నారు. - న్యూస్‌టుడే, కనగల్

బంకుల్లో నిబంధనలకు నామాలు



పెట్రోలు బంకుల్లో తనిఖీలు చేపడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖాధికారులు

మర్రిగూడ, చండూరు, న్యూస్‌టుడే: వాహనం లేనిదే కాలు బయట పెట్టలేని రోజులివి. ఇంటికో ద్విచక్ర, ఇతరత్రా వాహనాలుండటం సర్వసాధారణమైంది. మరి ఆ వాహనాల ఇంధనం కోసం వాహనదారులు తరచూ పెట్రోలు బంకులకు వెళ్లొస్తుంటారు. ఈ క్రమంలో వినియోగదారులకు బంకుల్లో యజమాన్యాలు పలు సౌకర్యాలు కల్పించాలి. కానీ ఆ నిబంధనలను గాలికొదిలేశారు. వాటికయ్యే ఖర్చును ఇంధనంలో కలిపి చమురు సంస్థలు వాహనదారుల నుంచి వసూలు చేస్తున్నా.. నిర్వాహకులు మాత్రం అందించడం లేదు. సంస్థలు దీర్ఘంగా ఈ విషయమై ప్రశ్నించిన దాఖలాలు లేవు. జిల్లా పౌరసరఫరాల అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించడంతో చెల్లించిన సొమ్ముకు తగిన వసతులు వాహనదారులు పొందలేకపోతున్నారు.



ఇదీ పరిస్థితి..

జిల్లాలో చాలా బంకుల్లో ఈ సౌకర్యాలు కనిపించడం లేదు. కొన్నిచోట్ల అరకొరగా ఉన్నా అవి వినియోగించుకునే స్థితిలో లేవు. కొన్ని బంకుల్లో తాగునీరు కనబడటం లేదు. మరుగుదొడ్లు ఉన్నా నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల వాటికి తాళాలు వేసి ఉంచుతున్నారు. వాహనాల్లో గాలి నింపే యంత్రాలు నామమాత్రంగానే కనిపిస్తున్నాయి. ఉపయోగంలో ఉన్నా గాలి నింపినందుకు డబ్బులు వసూలు చేస్తున్నారు. ఒక బంకులో రూ.10వేల విలువైన ఇంధనం అమ్మితే అందులోంచి సౌకర్యాల కల్పన కోసం రూ.600 ఖర్చు చేయాలి. ఇవన్నీ సౌకర్యాలు ఏర్పాటు చేసి వినియోగదారులకు ఉచితంగా అందించాలి. మనం పోయించుకునే ఇంధనంలో 6శాతం సౌకర్యాలకే చెల్లిస్తున్నాం.

కనిపించని ప్రథమ చికిత్స పెట్టెలు

బంకుల్లో ప్రథమ చికిత్స పెట్టెలను ఏర్పాటు చేసి వాహనదారులు వినియోగించుకునేలా అందుబాటులో ఉంచాలి. కానీ ఎక్కడా కనిపించిన దాఖలాలు లేవు. అలాగే ఫిర్యాదుల పెట్టెలు, పుస్తకాలు ఉంచాలి. చమురు సంస్థ, పౌరసరఫరాల అధికారుల హోదా, ఫోన్ నెంబర్లు ప్రచురించాలి. డీజిల్, పెట్రోల్ నాణ్యతను తెలుసుకునేందుకు పరీక్ష ఫిల్టర్ కాగితాలను, సంస్థ యజమాని, స్టాక్ వివరాలు అందరికీ కనిపించేలా ప్రదర్శించాలి.. కానీ ఏ బంకులోనూ కనపడటం లేదు. సంబంధిత శాఖ అధికారులు నామమాత్రంగా బంకుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

■ దీనిపై డీఎస్‌వో(నల్గొండ) వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. 'బంకుల్లో కనీస వసతులు ఏర్పాటు చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. ఇవి కచ్చితంగా ఏర్పాటు చేయాల్సిందే. ఎక్కడ లేవో తమ దృష్టికి వస్తే తప్పకుండా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పిల్లలు.. పైలం



మునుగోడు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల్లో ఉండే పాఠశాలలకి విద్యార్థులను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు జాగ్రత్తగా ఉండాలని.. భద్రంగా ఇంటికి చేర్చాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సూచించారు. మునుగోడు మండలం జామస్థాన్‌పల్లి గ్రామం నుంచి ఆటోలో వెళ్తున్న విద్యార్థులను చూసిన ఆయన కిక్కిరిసి ఎక్కించుకోవద్దని డ్రైవర్‌కి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.

ఎమ్మెల్యే విస్తృత పర్యటన...

మునుగోడు: మండలంలోని పులిపలుపుల, సింగారం, తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం విస్తృత పర్యటన చేశారు. పులిపలుపుల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. అనంతరం గ్రామాల్లో పలు వీధుల్లో పర్యటించారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా.. రైతుల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రుణమాఫీ చేస్తున్నామన్నారు. అనంతరం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఈ ముజీబుద్దీన్, నాయబ్ తహసీల్దార్ నరేష్, ఏఈ మణిదీప్, తదితరులు పాల్గొన్నారు.

డీ-37, 40 కాల్వలతో చెరువులు నింపాలి

తిప్పర్తి: మండలంలోని డీ-37, డీ-40 ప్రధాన కాల్వల ద్వారా గ్రామాల్లోని చెరువులు, కుంటలు నింపి రైతులకు సాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో డిస్ట్రిబ్యూటరీ కాల్వలు, చెరువులను మండల సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పరిశీలించారు. వెంకటరమణారెడ్డి, మన్నెం భిక్షం, గణేష్, వెంకన్న, ఉమా, యాదగిరి, సైదులు పాల్గొన్నారు.



మండలంలో డిస్ట్రిబ్యూటరీ కాల్వను పరిశీలిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

కమ్యూనిజం ప్రపంచ శాంతిని కోరుకుంటుంది ... తిప్పర్తి: కమ్యూనిజం ప్రపంచ శాంతిని కోరుకుంటుందని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అనిశెట్టిదుప్పలపల్లి, అంతయ్యగూడెం, గొల్లగూడ గ్రామాల్లో కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు శాఖ మహాసభలను శుక్రవారం నిర్వహించి మాట్లాడారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు వెంకటరమణారెడ్డి, భిక్షం, గణేష్, ఉమా, వెంకన్న, యాదగిరిరెడ్డి, సైదులు, లింగయ్య, శంకర్ పాల్గొన్నారు.

ధరల అదుపులో ప్రభుత్వాలు విఫలం: సిపిఎం... కేతేపల్లి: పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరల అదుపులో పాలక ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల విమర్శించారు. స్థానిక అమరవీరుల స్మారక భవనంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శి చింతపల్లి లూర్థుమారయ్య, జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు, రాజు, లింగయ్య, శ్రీను, సత్తయ్య, ఎల్లయ్య, సైదయ్య పాల్గొన్నారు.

నిర్మాణానికి అనుమతి

నార్కట్‌పల్లి గ్రామీణం: మండల కేంద్రంలో రెండు ఏళ్లుగా ఓ ప్రార్థనా మందిరం విషయంలో జరుగుతున్న వివాదం డీఎస్పీ శివరాంరెడ్డి, ఆర్టీసీ విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, ఆర్టీసీ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి మహంకాళి ఆధ్వర్యంలో శుక్రవారం సద్దుమనిగింది. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రెండేళ్ల క్రితం స్థానిక ఆర్టీసీ ప్రహరీ వద్ద ఉన్న ప్రార్థనా మందిరాన్ని తొలగించారు. తిరిగి మందిరాన్ని నిర్మించాలని కుల సంఘాల పెద్దలు చెప్పడంతో, ఆర్టీసీ అధికారులు అడ్డు చెప్పారు. ఘటనా స్థలాన్ని అధికారులు పరిశీలించారు. మందిరానికి సంబంధించిన ఆధారాలను కుల పెద్దలు చూపడంతో అదే స్థలంలో నిర్మాణానికి అనుమతి ఇచ్చారు. సీఐ నాగరాజు, ఎస్సై క్రాంతికుమార్ పాల్గొన్నారు.

జూట్ బ్యాగ్‌ల తయారీపై ఉచిత శిక్షణ


నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఎస్‌బీఐ గ్రామీణ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఆర్‌సెట్) ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ మహిళలకు జూట్ బ్యాగ్ తయారీపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ రఘుపతి ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసేవారి వయస్సు 19 నుంచి 45 మధ్య ఉండాలని, పదో తరగతి చదివిన వారు అర్హులన్నారు. శిక్షణలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామన్నారు. ఈ నెల 30 వరకు ఎస్‌బీఐ ఆర్‌సెట్, రాంనగర్, నల్గొండలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9701009265ను సంప్రదించాలని సూచించారు.

కార్మికుడి బలవన్మరణం

నకిరేకల్, న్యూస్‌టుడే: వడ్రంగి కార్మికుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన నకిరేకల్‌లో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. . స్థానిక వీటీ కాలనీలో నివాసం ఉంటున్న నాగోజు నాగాచారి(35) ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఉరివేసుకొని గురువారం రాత్రి బలవన్మరణానికి పాల్పడ్డారని ఎస్సై లచ్చిరెడ్డి తెలిపారు. కుటుంబ కలహాలే ఆత్మహత్యకు కారణమని బాధితుని తండ్రి యాదగిరి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి సీఐ రాజశేఖర్ నేతృత్వంలో దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.



నాగాచారి



నల్గొండ: పర్యాటక దినోత్సవంలో పాల్గొన్న విశ్రాంత ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, అధ్యాపకులు, విద్యార్థులు

పర్యాటక ప్రదేశాలపై అవగాహన అవసరం

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం ఎంజీయూలో ఎంబీఏ టీటీఎం విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంబీఏ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు పర్యాటక రంగంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయన్నారు. విద్యార్థులు దేశంలోని పర్యాటక ప్రదేశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎంబీఏ టీటీఎం విభాగం హెచ్‌వోడి డా.మారం వెంకటరమణారెడ్డి, ప్రొఫెసర్ సరిత, డా.ఎంవీఆర్, అధ్యాపకులు డా.మిర్యాల రమేశ్, డా.ప్రవళిక, డా.లక్ష్మీప్రభ, డా.స్వప్న, జ్యోతి, కిరణ్మయి, సురేశ్‌రెడ్డి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్జీలో.. నల్గొండ నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ పర్యాటక దినోత్సవ సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ సురేశ్‌బాబు, అధ్యాపకులు డా.పరంగి రవికుమార్, కోటయ్య, శ్రీధర్, సైదులు, సాయి తేజ పాల్గొన్నారు.

నకిరేకల్ పర్యాటక రంగంలో మంచి ఉపాధి అవకాశలుంటాయని నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.బెల్లి యాదయ్య సూచించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా కళాశాల యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో పర్యాటకంపై ఆసక్తిని పెంచేందుకు చరిత్ర శాఖ ఆధ్వర్యంలో ఈ క్లబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. చరిత్ర సహాయ ప్రొఫెసర్ ప్రవీణ్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆహార అలవాట్ల మార్పుతోనే పోషకాహార లోప నివారణ

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఆహార అలవాట్లలో మార్పులు, చైతన్యంతోనే సమాజంలో పోషకాహార లోపాన్ని అరికట్టవచ్చని అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర సూచించారు. జాతీయ పోషకాహార మాసోత్సవాన్ని పురస్కరించుకుని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యునికేషన్స్(సీబీసీ) ఆధ్వర్యంలో నల్గొండలో నిర్వహిస్తున్న మూడు రోజుల సమగ్ర సమాచార అవగాహన కార్యక్రమంలో రెండో రోజు గర్భిణులు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు. సదస్సులో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పోషకాహారంపై సామాజిక మార్పు తేవడమే పోషణ్ అభియాన్ లక్ష్యమని వివరించారు. ఆరోగ్య విభాగం ప్రోగ్రాం అధికారి డా.అరుంధతి, ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి కోటేశ్వరరావు, జిల్లా సంక్షేమాధికారి సక్కుబాయి, సీపీవో వెంకటేశ్వర్లు, కళాకారులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర



అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న భాజపా కిసాన్ మోర్చ నాయకులు

రైతు పెట్టుబడి సాయం అందించాలి: భాజపా

నీలగిరి, న్యూస్‌టుడే: రైతులందరికీ రుణమాఫీ చేయాలని భాజపా కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో శుక్రవారం అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా రూ.2లక్షల రుణమాఫీ, పెట్టుబడి సాయంగా ఎకరాకు రూ. 15,000 వేలు, అన్ని రకాల ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చ జాతీయ నాయకుడు గోలి మధుసూధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కర్ర దామోదర్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.



నార్కట్‌పల్లిలో రైతు ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి: మాజీ ఎమ్మెల్యే

నార్కట్‌పల్లి గ్రామీణం న్యూస్‌టుడే: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అన్నివిధాల మోసం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో రైతు ధర్నాను నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం రూ.2లక్షల వరకు రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



అక్షర క్రమంలో నిలబడిన కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు

స్వచ్ఛ నీలగిరిగా మార్చుకుందాం

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: నల్గొండను పరిశుభ్రత పట్టణంగా మార్చే ప్రక్రియలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పుర కమిషనర్ ముసాబ్ అహ్మద్ సయ్యద్ కోరారు. స్వేచ్ఛ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రాకపోకలకు అంతరాయం.. చిట్యాల: జాతీయ రహదారిపై చిట్యాల మండలం పెద్ద కాపర్తి శివారులో శుక్రవారం తెల్లవారుజామున వరుసగా ఒకదాని వెనుక మరికొన్ని వాహనాలు ఢీకొనడంతో రాకపోకలకు అంతరాయం కలిగిందని ఎస్సై ఎన్.ధర్మా పేర్కొన్నారు. పెద్దకాపర్తి శివారులో ట్యాంకరు వాహనం ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. దీంతో ఆ బస్సు.. ముందున్న మరో బస్సును ఢీకొనగా, వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిందని, వాటిని పక్కకు జరిపి రాకపోకలను పునరుద్ధరించామని ఎస్సై పేర్కొన్నారు.

స్వయంగా సంతకం తీసుకున్న సిబ్బంది.. చిట్యాల: సుంకెనపల్లిలో భార్య సంతకం భర్త ఫోర్జరీ చేసి బ్యాంకులో పంట రుణం తీసుకున్నారంటూ నమోదైన కేసుకు సంబంధించి.. భర్త ప్రవీణ్ తన భార్య మౌనిక పేరిట మార్పిడి చేసిన భూమికి సంబంధించి.. తీసుకున్న రుణబాకీని తన భార్య పేరిట మార్పిడి చేసే క్రమంలో సంబంధిత బ్యాంకు సిబ్బంది స్వయంగా ప్రవీణ్ ఇంటికి వెళ్లి ఆయన భార్య మౌనికతో సంతకం తీసుకున్నట్లు తమ ప్రాథమిక విచారణలో తేలిందని ఎస్సై ఎన్.ధర్మా శుక్రవారం పేర్కొన్నారు.

ఉపాధ్యాయ పోస్టుకు ఇంటర్వ్యూ... కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్‌లో ఉన్న మండల ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఆర్థికశాస్త్రం ఉపాధ్యాయ పోస్టు భర్తీకి ఈనెల 30వ తేదీన జరిగే ఇంటర్వ్యూకు అర్హులైన అభ్యర్థులు హాజరు కావాలని పాఠశాల ప్రిన్సిపల్ మమత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఎంఏ ఆర్థికశాస్త్రంతో పాటు బీఈడీ పూర్తి చేయాలని, అర్హతగల వారు ధ్రువపత్రాలతో ఈనెల 30న పాఠశాలకు రావాలని కోరారు. విద్యార్థులకు ఒక డెమో పాఠ్యాంశం బోధించాలని పేర్కొన్నారు.

నేటి నుంచి ఆత్మజ్ఞాన శిక్షణ తరగతులు... నీలగిరి, న్యూస్‌టుడే: ఆత్మ జ్ఞానం గురించి తెలిపేందుకు ట్రూత్ వివేకామృతం సంస్థ నిర్వాహకులు వివేకానంద గురూజీ ఆధ్వర్యంలో ఆత్మ జ్ఞాన శిక్షణ తరగతులు శని, ఆదివారాలలో స్థానిక వైఆర్‌పీ ట్రస్టు కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రామారావు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకోసం **9848258366** సంప్రదించాలని సూచించారు.

ధ్రువీకరణ పత్రాల పరిశీలన... నల్గొండ విద్యావిభాగం: డీఎస్సీ-2008 బాధితుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన శుక్రవారం ప్రారంభమైంది. మొత్తం 391 మంది బాధితులకు సంబంధించి ఇప్పటికే జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఈ పరిశీలన అక్టోబర్ 5 వరకు ఇచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన పత్రాల పరిశీలనలో వంద మంది వరకు హాజరైనట్లు తెలిసింది. పరిశీలన పూర్తయ్యాక నివేదికను డైరెక్టరేట్‌కు సమర్పించనున్నారు. నిబంధనల ప్రకారం అర్హులకు కాంట్రాక్టు పద్ధతిలో ఎస్‌జీటీ పోస్టుల్లో నియామకం చేయనున్నారు.

బహూకరణ.. చిట్యాల: లయన్స్ క్లబ్ నల్గొండ స్నేహ ఆధ్వర్యంలో నేరడ ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలకు రూ.20వేల విలువగల డెస్క్ బెంచీలను శుక్రవారం బహూకరించారు.

బాధ్యతలు స్వీకరణ.. చిట్యాల: చిట్యాలలో ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన పానుగోతు సైదా నాయక్‌ను శుక్రవారం భవిత కేంద్రం బాధ్యులు శ్రీనివాస్, ప్రైవేటు పాఠశాలల వ్యవహారకర్తలు జమీరుద్దీన్ సన్మానించారు.

కట్టంగూరు: మండల విద్యాధికారిగా అంబటి అంజయ్య బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈయన కట్టంగూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు.

మర్రిగూడ: మండల పరిధిలోని దామెరభీమనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న బిట్టు శ్రీనివాస్ మండల విద్యాధికారిగా శుక్రవారం విద్యావనరుల భవనంలో బాధ్యతలు స్వీకరించారు.

పరిమితికి మించి ప్రయాణికులుంటే చర్యలు ... నాంపల్లి: ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను, విద్యార్థులను ఆటోల్లో ఎక్కించుకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎం.శోభన్‌బాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్లో ఆటో డ్రైవర్లకు ప్రభుత్వ నిబంధనలు, ప్రయాణికుల భద్రతకు పాటించాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.

విద్యుత్తుశాఖలో బదిలీల షెడ్యూల్ విడుదల... నల్గొండ జిల్లా పరిషత్తు: విద్యుత్తుశాఖలో ఉద్యోగుల బదిలీలు నిర్వహించేందుకు దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ శుక్రవారం షెడ్యూల్ విడుదల చేసింది. రెండు ఏళ్లుగా సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు బదిలీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ప్రతి కేటగిరిలో 50శాతం వరకు ఉద్యోగుల బదిలీలు చేపట్టనున్నారు. ఈనెల 28 నుంచి బదిలీల ప్రక్రియ ప్రారంభం కానుంది. వచ్చే నెల 10లోపు బదిలీ అయిన ప్రాంతంలో విధుల్లో చేరే విధంగా షెడ్యూల్‌లో రూపొందించారు.

పోగొట్టుకున్న బ్యాగు అప్పగింత... నల్గొండ నేరవిభాగం: జిల్లా కేంద్రంలోని సావర్కర్‌నగర్ ప్రాంతానికి చెందిన గోగికర్ పద్మావతి శుక్రవారం ప్రకాశంబజార్‌లో తన బ్యాగును పోగొట్టుకున్నారు. అందులో నాలుగు తులాల బంగారు ఆభరణాలు, రూ.10వేల నగదు ఉన్నాయి. ఇంటికెళ్లి చూసుకోగా.. కనిపించకపోవటంతో కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన సీఐ రాజశేఖర్‌రెడ్డి ఘటనా స్థలంలో సీసీ కెమెరాలు తనిఖీ చేస్తుండగా ఆ ప్రాంతానికి చెందిన బిక్షాల యాదగిరి స్టేషన్‌కు వచ్చి బ్యాగు దొరికినట్లు ఇచ్చారు. తిరిగి బ్యాగును బాధిత మహిళకు అప్పగించిన యాదగిరిని సీఐ శాలువాతో సత్కరించారు.

విద్యార్థులకు ఎస్సై కౌన్సిలింగ్... నార్కట్‌పల్లి గ్రామీణం: యల్లారెడ్డిగూడెం శివారులోని ఎంజీయూలో గురువారం రాత్రి భోజనశాలలో అన్నం తింటుండంగా ఆర్ట్స్, సైన్స్ విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. అనంతరం ఇరువర్గాల విద్యార్థులు అర్ధరాత్రి నార్కట్‌పల్లి పోలీస్ ఠాణాకు వెళ్లారు. ఎస్సై క్రాంతి కుమార్ వారికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు.

సినిమాలు

నల్గొండ కల్చరల్, నకిరేకల్, న్యూస్‌టుడే

నల్గొండ: **పీవీఎన్:** దేవర, **నటరాజ్:** దేవర, **వెంకటేశ్వర:** దేవర

నకిరేకల్: **రామకృష్ణ-** సత్యం సుందరం, **వెంకటేశ్వర-** దేవర

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి

నల్గొండ, నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాల్లో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా శుక్రవారం నివాళి అర్పించారు. ఆయన సేవలు మరువలేనివని నేతలు కొనియాడారు. గట్టుప్పల మండల కేంద్రంలోని చౌరస్తాలోని పద్మశాలి సంఘం వద్ద బాపూజీ కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు జగన్నాథం, డీసీసీబీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశం, తహసీల్దార్ రాములు, ఎంఈవో అమృతాదేవి, పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో ఉన్న విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, హైదరాబాద్ రోడ్డులోని మిల్క్‌సెంటర్ వద్ద అడిషనల్ కలెక్టర్ పూర్ణచంద్ర, పురపాలిక ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ రమేశ్‌గౌడ్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ నివాళి అర్పించారు. నకిరేకల్ పద్మశాలి సంఘం భవనంలో ఆ సంఘ అధ్యక్షుడు కృష్ణమూర్తి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ బెల్లి యాదయ్య, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ మల్లారెడ్డి నివాళి అర్పించారు. నల్గొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ సుధారాణి, ఎంజీ విశ్వవిద్యాలయంలో వర్సిటీ ఓఎస్డీ అంజిరెడ్డి నివాళి అర్పించారు. కనగల్ తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ పద్మ నివాళి అర్పించారు. గట్టుప్పలలో భాజపా రాష్ట్ర కార్యాలయంలో చేనేత మోర్చ రాష్ట్ర కన్వీనర్ సుధాకర్, మర్రిగూడ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మునయ్య బాపూజీకి నివాళి అర్పించారు. - న్యూస్‌టుడే బృందం



గట్టుప్పలలో లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



నల్గొండ ఎంజీయూలో...



జిల్లా పోలీస్ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న ఏఆర్ డీఎస్పీ రమేశ్




నల్గొండ ప్రభుత్వ బాలికల కళాశాలలో పాల్గొన్న ప్రిన్సిపల్ సుధారాణి, అధ్యాపకులు



నకిరేకల్: లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి, నాయకులు

నల్గొండ: కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి





నల్గొండ: విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న అడిషనల్ కలెక్టర్ పూర్ణచంద్ర పుర ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మిర్యాలగూడ
•మిర్యాలగూడ •నాగార్జునసాగర్ •దేవరకొండ

ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం


విజయవిహార్ వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని సాగర్‌లో తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యాటక అతిథిగృహం వద్ద విజయవిహార్ మేనేజర్ కిరణ్ ఆధ్వర్యంలో కోలాటాలు, గిరిజన నృత్యాల కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీధర్, తులసి, హేమ్లా, సత్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

నాగార్జునసాగర్: పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ నాయకులు నందికొండ మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. బషీర్ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు పురపాలిక సంఘం ముందు నిరసన చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
77994 92939
99121 74975
98487 81656

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని బంగారుగడ్డలో వీధి దీపాలు పగలు సైతం వెలుగుతున్నాయి. **– అంజి, మిర్యాలగూడ.**

✔ పగటి వేళలో వీధి దీపాలు బంద్ చేసేందుకు చర్యలు తీసుకుంటాం. **– ఎండీ యూసుఫ్, పుర కమిషనర్, మిర్యాలగూడ**

త్రిపురారం, న్యూస్‌టుడే:

? మండలంలోని కామారెడ్డిగూడెం గ్రామానికి కరోనా దగ్గర నుంచి బస్సు సౌకర్యం లేదు. **– జితేందర్‌రెడ్డి, కామారెడ్డిగూడెం**

✔ మిర్యాలగూడ డిపోలో బస్సులు తక్కువున్నాయి. కొత్త బస్సులు రాగానే గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తాం. **– రాంమోహన్‌రెడ్డి, డీఎం, మిర్యాలగూడ**

విధుల్లో అప్రమత్తత అవసరం

చందంపేట, న్యూస్‌టుడే: విధుల్లో మండల స్థాయి అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చందంపేట ఎంపీడీవో కార్యాలయం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి పల్లెప్రగతి, బృహత్‌పార్కును పరిశీలించారు. అనంతరం స్వేచ్ఛతా హీ సేవా ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంపీడీవో లక్ష్మి, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల గుర్తింపు సర్వే

చందంపేట, న్యూస్‌టుడే: నక్కలగండి ప్రాజెక్టు బ్యాలెన్స్ రిజర్వాయర్, కంబాలపల్లి వైపు వెళ్లే రహదారి నిర్మాణంలో 250 హెక్టార్ల అటవీశాఖ భూములు ముంపునకు గురవుతున్నాయని.. బదులు ప్రభుత్వం భూములను గుర్తించి అటవీశాఖకు అప్పగించేందుకు సర్వే చేపడుతున్నామని నీటి పారుదలశాఖ డీఈ చక్రపాణి తెలిపారు. శుక్రవారం పెద్దమునగల్, తిమ్మాపూర్, నేరెడుగొమ్ము గ్రామాల సమీపంలో ప్రభుత్వ రెండు శాఖల అధికారులు సర్వే నిర్వహించారు. నేరెడుగొమ్ము గ్రామంలో సర్వే నెంబర్ 138, తిమ్మాపూర్‌లో 147, పెద్దమునగల్‌లో 201 సర్వే నంబర్లలో 180హెక్టార్ల ప్రభుత్వ భూమిని గుర్తించామని అధికారులు తెలిపారు. మరో 70 హెక్టార్లను గుర్తించి అటవీశాఖకు అప్పగించే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. అధికారులు శ్రీదేవి, జేఈలు ఉన్నారు.


పెద్దమునగల్ గ్రామం సమీపంలో సర్వే నిర్వహిస్తున్న నీటిపారుదల, అటవీశాఖ అధికారులు

నిధులున్నా.. ప్రారంభానికి నోచుకోని వంతెన


వంతెనపై అపసవ్య దిశలో వస్తున్న విద్యార్థులు

హాలియా, న్యూస్‌టుడే: గత రెండేళ్ల క్రితం కోదాడ-జడ్చర్ల 167 జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా హాలియాలోని దేవరకొండ రోడ్డులో ఎడమకాలువపై వంతెన విస్తరణ పనులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ గుత్తేదారు నిర్లక్ష్యంతో ప్రయాణికులకు ప్రమాదకరంగా మారింది. జాతీయ రహదారి కావడంతో ఈ మార్గం గుండా హైదరాబాద్ నుంచి కర్నూల్ నుంచి విజయవాడ, గుంటూరుకు ప్రతిరోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వంతెన ఇరుకుగా ఉండడంతో రాకపోకలు సమస్యగా మారింది. ఈ వంతెన సమీపంలో జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలు ఉన్నాయి. రోజూ వందలాది మంది విద్యార్థులు ఈ వంతెన గుండా రాకపోకలు సాగిస్తుంటారు. ఇరుకైన వంతెన కావడం, ఎడమకాలువ ప్రవాహం ఉద్ధృతంగా ఉండటంతో విద్యార్థుల రాకపోకలు సాగించడానికి ప్రమాదకరంగా పరిస్థితి ఏర్పడింది. నూతన వంతెన నిర్మాణానికి రూ.156 లక్షల నిధులు మంజూరు కాగా గుత్తేదారు నిర్లక్ష్య కారణంగా పనులు చేపట్టలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదం జరిగితే కాని అధికారులు, ప్రభుత్వం స్పందించదా అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. 60 అడుగుల పొడవు, 40 అడుగుల వెడల్పుతో వంతెన విస్తరణ పనులు జరగాల్సి ఉండగా.. ప్రస్తుతం ఎడమకాలువలో నీటి విడుదల కొనసాగుతుండగా పనులు చేపట్టలేదని 167 జాతీయ రహదారి డీఈ కబ్జ రాజశేఖర్ తెలిపారు.

రాకపోకలకు ఇబ్బందిగా ఉంది



– కట్టెబోయిన పరమేష్, లింగంపల్లి, పెద్దవూర మండలం

జాతీయ రహదారి విస్తరణ జరిగిన అనంతరం వాహనాల రద్దీ అధికంగా ఉంది. ఈ వంతెనపై రాత్రి వేళల్లో ప్రయాణం చాలా ప్రమాదకరంగా మారింది. ఇరుకైన వంతెన కావడంతో ఎదురుగా వస్తున్న పెద్ద వాహనాలను తప్పించబోయి అదుపుతప్పి ఎడమకాలువలో పడే ప్రమాదం ఉంది.

విద్యార్థులకు ప్రమాదకరం



– చనగల్ల ఎల్లయ్య, ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడు, నాయుడుపాలెం, అనుముల

ఇరుకైన వంతెన, రోడ్డంతా గుంతలమయం కావడంతో ఉదయం, సాయంత్రం రాకపోకలు సాగిస్తున్న విద్యార్థులకు ప్రమాదకరంగా ఉంది. ఈ రహదారిలో భారీవాహనాల రద్దీ అధికంగా ఉంది. ప్రభుత్వం స్పందించి వెంటనే వంతెన విస్తరణ పనులు చేపట్టాలి. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి.

స్వచ్ఛ భారత్ కార్యక్రమం

దేవరకొండ, న్యూస్‌టుడే: దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్, నల్గొండ నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం బస్‌స్టేషన్, బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, నెహ్రూ యువకేంద్రం యూత్ అధికారి ప్రవీణ్‌సింగ్, కొండానాయక్ విద్యార్థులతో కలిసి స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. తాళ్ల సురేష్, వలమాల ఆంజనేయులు, గుమ్మడవెల్లి రూప తదితరులున్నారు.


దేవరకొండ బస్టాండ్ ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినిలు

ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు అభినందనీయం

నిడమనూరు, న్యూస్‌టుడే: సొంత ఖర్చులతో స్వగ్రామంలో ఉచితనేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమని సీఎల్పీ మాజీనేత కుందూరు జానారెడ్డి అన్నారు. మండలంలోని బొక్కమంతలపహాడ్‌లో ఆ గ్రామానికి చెందిన పుట్ట ప్రభాకర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యులు చెన్నైకు చెందిన శంకర్ నేత్రాలయ వారి ద్వారా ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు యడవల్లి రంగశాయిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. శుక్రవారం వైద్యశిబిరాన్ని జానారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. జడ్పీ వైస్‌ఛైర్మన్ లింగారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, సత్యం, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వలభ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న జానారెడ్డి

నాణ్యమైన విద్యనందించండి


తరి రామును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దఅడిశర్లపల్లి, న్యూస్‌టుడే: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో కృషిచేయాలని పీఏపల్లి ఎంఈవో ఎ.వెంకటయ్య, గుడిపల్లి ఎంఈవో ఎస్.శ్రీనివాసులు ఆకాంక్షించారు. ఇటీవల బదిలీపై వెళ్లిన తరి రాముకు వీడ్కోలు, నూతన ఎంఈవోల బాధ్యతల స్వీకరణ సందర్భంగా ఎ.వెంకటయ్య, ఎస్.శ్రీనివాసులను సన్మానించారు. శుక్రవారం పీఏపల్లి ప్రాథమిక పాఠశాలలో పీఆర్‌టీయూటీఎస్, టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో సన్మానోత్సవం నిర్వహించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జగదీశ్వర్‌రెడ్డి, ఎస్.శ్రీనివాస్, పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు కె.మున్న, ఆర్.అనిల్‌కుమార్, టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు పి.జీవన్‌కుమార్, పి.వెంకటేశ్వర్లు, సీహెచ్.వెంకయ్య పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి


మిర్యాలగూడలో సందీపారెడ్డి, విద్యార్థులు రూపొందించిన ఆకృతులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చిన్నతనం నుంచే కళా రంగంలో సృజనాత్మకతను పెంపొందించుకోవడం ద్వారా మెదడు చురుకుగా మారుతుందని ఎమ్మెల్యే బీఎల్ఆర్ అన్నారు. మిర్యాలగూడకు చెందిన గిన్నిస్ రికార్డు విజేత చల్లమల సందీపారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని బదిరుల కళాశాలలో వారం రోజుల పాటు హ్యాండ్‌క్రాఫ్ట్‌లో ఉచిత శిక్షణ ఇచ్చింది. శుక్రవారం వారు రూపొందించిన అలంకరణ వస్తువుల ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను ప్రారంభించి, వారిని అభినందించిన ఎమ్మెల్యే బీఎల్ఆర్ మాట్లాడుతూ.. మాట్లాడడం రాకపోయినా విద్యార్థులు రూపొందించిన ఆకృతులు వారిలోని ప్రతిభకు నిదర్శనంగా నిలిచాయన్నారు. అనంతరం సందీపారెడ్డిని ఘనంగా సత్కరించారు. వేణుగోపాల్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ రేపాల శ్రీనివాస్, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

బాపూజీ పోరాటం స్ఫూర్తిదాయకం

మిర్యాలగూడ, నాగార్జున సాగర్, దేవరకొండ నియోజకవర్గాల్లోని పట్టణాలు, మండలాల్లో స్వాతంత్య్ర సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని శుక్రవారం ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల కోసం తన జీవిత కాలం మొత్తం ఉద్యమించిన బాపూజీ పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు, ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, బృందం


మిర్యాలగూడలో.. ఎమ్మెల్యే బీఎల్ఆర్, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్


దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో బాపూజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్


దేవరకొండ సేవాసదన్ భవన్‌లో..


నాగార్జునసాగర్‌లో..


మిర్యాలగూడలో తన కార్యాలయంలో.. సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్


హాలియాలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..


కొండమల్లేపల్లి: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ మెట్ట ఉద్యాన పరిశోధనా కేంద్రంలో పాల్గొన్న శాస్త్రవేత్త డా.రాజాగౌడ్, తదితరులు

యువకుడి మృతదేహం లభ్యం



త్రిపురారం, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన **వేమవరపు సాయి,** మేదరి శైలజ ఈనెల 25న దుస్తులు ఉతకడానికి నిడమనూరు మండలంలోని బొక్కమంతలపాడు సమీపంలో సాగర్ ఎడమకాల్వలోకి వెళ్లారు. ప్రమాదవశాత్తూ కాలు జారి గల్లంతయ్యారు. ఈనెల 26న కంపసాగర్ సమీపంలోని కాల్వలో మేదరి శైలజ మృతదేహం లభ్యమైంది. ఈమెకు ముగ్గురు కుమార్తెలున్నారు. వేమవరపు సాయి మృతదేహం అదే రోజు రాత్రి పెద్దదేవులపల్లి చెరువులో లభ్యమైంది. వీరిద్దరి మృతదేహాలను మరణోత్తర పరీక్షల నిమిత్తం మిర్యాలగూడ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. సాయికి కుమారుడు ఉన్నాడు.

అవీ ఇవీ

చరవాణులు అందజేత.. కొండమల్లేపల్లి: పట్టణంలో ఆరు నెలల కాలంలో చరవాణులను పోగొట్టుకున్న ఐదుగురు వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదులను సీఈఐఆర్ యాప్‌లో నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై రాంమూర్తి తెలిపారు. చరవాణులను స్వాధీనంచేసుకుని శుక్రవారం బాధితులకు అందజేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వినతి.. చింతపల్లి: గ్రామంలో గుంపులు గుంపులుగా తిరుగుతూ చిన్నారులు, మహిళలపై దాడులు చేస్తున్న శునకాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని భాజపా ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి వెన్నం శేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సుజాత, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌కు గ్రామస్థులు వినతిపత్రం అందించారు. భజరంగ్‌దళ్ మండల అధ్యక్షుడు సోమరాజు ప్రదీప్, వెంకటరమణ, సాయి, ప్రవీణ్, జగదీష్ పాల్గొన్నారు.

హాలియా: గత ప్రభుత్వం 2023 మే 1న కార్మికుల దినోత్సవం సందర్భంగా ప్రతి పారిశుద్ధ్య కార్మికుడికి అదనంగా ప్రతినెల రూ.వెయ్యి పెంచుతూ ఇచ్చిన హామీని 16 నెలలుగా ఇవ్వడం లేదని వెంటనే అందించాలని కోరుతూ హాలియా పుర పారిశుద్ధ్య కార్మికులు కమిషనర్ రామదుర్గారెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

చేయూత.. మిర్యాలగూడ పట్టణం: మిర్యాలగూడలోని 45వ వార్డుకు చెందిన సుగుణమ్మ ఇంట్లో ఇటీవల అగ్నిప్రమాదం జరిగి వస్తువులన్నీ కాలిపోవడంతో.. విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ తిరునగరు నాగలక్ష్మి ఆధ్వర్యంలో పుర అధ్యక్షుడు తిరునగరు భార్గవ్ చేతుల మీదుగా శుక్రవారం క్వింటాలు బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు, చీరలు, రూ.5వేల నగదు అందించారు.

వ్యత్యాసం తగ్గించాలి.. గుర్రంపోడు: స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీల మధ్య అసహజ వేతన వ్యత్యాసం తగ్గించాలని ఎస్జీటీ ఐక్యవేదిక డిమాండ్ చేసింది. శుక్రవారం గుర్రంపోడు మండలం కొప్పోలులో జరిగిన పాఠశాల కాంప్లెక్స్ సమావేశం అనంతరం ఉపాధ్యాయులు విలేకరులతో మాట్లాడారు. జీఓ ఎంఎస్ నెం.25 ప్రకారం ఉపాధ్యాయుల పని సర్దుబాటులో భాగంగా ప్రతి ప్రాథమిక పాఠశాలకు తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున, ప్రధానోపాధ్యాయుడు కూడా ఉండాలని డిమాండులో పేర్కొన్నారు.

బాధ్యతలు స్వీకరణ.. తిరుమలగిరి సాగర్: మండల విద్యాధికారిగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న **కొనమంచిలి శ్రీనివాస్** శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన మండల విద్యాధికారికి పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సంఘం సభ్యులు పరుశురాం, సైదిరెడ్డిలు శాలువతో సన్మానం చేశారు.

హాలియా: అనుముల మండల నూతన విద్యాధికారిగా హాలియా జడ్పీ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు **గుండా కృష్ణమూర్తి** ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హాలియాలో పీఆర్టీయు, యుటీఎఫ్, తపస్, ఉపాధ్యాయ సంఘాల, ఆర్యవైశ్య సంఘం నాయకులు సన్మానించారు.

గుర్రంపోడు: మండల విద్యాధికారిగా కొప్పోలు ప్రభుత్వ ఉన్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న **నోముల యాదగిరి** బాధ్యతలు స్వీకరించారు.

సకాలంలో స్పందన.. నాగార్జునసాగర్: మతిస్థిమితం లేకుండా తిరుగుతూ సాగర్‌కు వచ్చి కొత్త వంతెన వద్ద ఆత్మహత్య చేసుకోబోయిన వృద్ధుడిని సాగర్ పోలీసులు సకాలంలో స్పందించి కాపాడి కుటుంబసభ్యులకు అప్పగించారు. సాగర్ ఎస్సై సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. హాలియా శాంతినగర్‌కు చెందిన దొడ్డి పాండయ్య మతిస్థిమితం లేకుండా ఉండడంతో శుక్రవారం సాగర్ కొత్త వంతెనపై నుంచి దూకడానికి ప్రయత్నిస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందజేయడంతో ఎస్సై సిబ్బందితో వెళ్లి అతనిని కాపాడి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

మెరుగైన సేవలు అందించాలి.. వేములపల్లి: మండల కేంద్రంలోని అంబులెన్స్‌ను శుక్రవారం జిల్లా ప్రోగ్రాం మేనేజర్ నజీరుద్దీన్ ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. ప్రమాదంలో గాయపడ్డ బాధితులను ఏ విధంగా చికిత్సలు అందించాలో, అత్యవసర కేసుల్లో పాటించాల్సిన నియమ నిబంధనలను తెలియజేశారు. ప్రోగ్రాం సూపర్‌వైజర్ మధు, టెక్నీషియన్ సైదులు, పైలట్ అరుణ్ నాయక్ పాల్గొన్నారు.

సహకరించాలి.. గుర్రంపోడు: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో రైతులకు సరైన ప్రాధాన్యత లభించటం లేదని, రుణాలకోసం వచ్చిన రైతులు బ్యాంకర్లను తిట్టుకుంటున్నారని డైరెక్టర్లు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం గుర్రంపోడులో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు వెలుగుయాదయ్య, వడ్డెగోని యాదగిరిగౌడ్‌లు మాట్లాడుతూ రైతులకు రుణాలు ఇప్పించటంలో సహకారసంఘం అధికారులు విఫలమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాజ్యాధికారమే లక్ష్యం.. కొండమల్లేపల్లి: రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలని తెలంగాణ మాదిగ సంఘాల మహా కూటమి జిల్లా ఇన్‌ఛార్జి పొట్టపాక మురళీకృష్ణ, నియోజకవర్గ అధ్యక్షుడు ఆదిరాల నగేష్ మాదిగలకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన సంఘం డివిజన్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం సంఘం మండల, పట్టణ నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షునిగా శ్రీను, ఉపాధ్యక్షునిగా సైదయ్య, పట్టణాధ్యక్షునిగా రాజశేఖర్, ఉపాధ్యక్షునిగా వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, కార్యదర్శులుగా కిరణ్, అజయ్‌లను ఎన్నుకున్నారు.

బాధిత కుటుంబానికి మూడు ఎకరాల భూమి

దేవరకొండ, న్యూస్‌టుడే: గత ఏడాది చింతపల్లి మండలం పాలెంతండాకు చెందిన నేనావత్ సూర్యనాయక్ మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు శుక్రవారం దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో మూడు ఎకరాల పట్టాభూమి, కుమారునికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ నియామకపత్రాన్ని ఎమ్మెల్యే బాలునాయక్ అందజేశారు. ఆర్డీవో శ్రీరాములు, డీఎస్పీ గిరిబాబు, హరినాయక్, సిరాజ్, హరికృష్ణ పాల్గొన్నారు.

దరఖాస్తులు చేసుకోండి

చింతపల్లి, న్యూస్‌టుడే: వ్యవసాయ భూమి కలిగి వివిధ బ్యాంకుల్లో రూ.2లక్షల లోపు పంట రుణాలు తీసుకొని రేషన్‌కార్డు లేకపోవడంతో రుణమాఫీ జరగని రైతులు మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి శ్రావణకుమారి అన్నారు. శుక్రవారం ఆమె స్థానికంగా మాట్లాడారు. కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం ఆధార్ కార్డు జిరాక్స్‌లు, రుణమాఫీ ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందించాలని కోరారు.

పోలీసులు సకాలంలో స్పందించాలి

మిర్యాలగూడ: వేములపల్లి మండలం కామేపల్లిలో మానసిక దివ్యాంగురాలిపై అత్యాచారానికి పాల్పడిన యువకుడు, అతడి కుటుంబసభ్యులపై చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి వస్కుల మట్టయ్య కోరారు. స్థానికంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ పోలీసులు కేసు నమోదు చేసినప్పటికి నిందితులను అదుపులోకి తీసుకోకపోవటంతో బాధితురాలి కుటుంబ సభ్యులకు ప్రాణభయం ఉందన్నారు. పోలీసులు సకాలంలో స్పందించాలని కోరారు.

సాంకేతికత మోజులో మానవ సంబంధాలు ఆవిరి


సదస్సులో మాట్లాడుతున్న నందిని సిధారెడ్డి

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: సాంకేతికత మోజులో మానవ సంబంధాలు ఆవిరై పోతున్నాయని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు కస్తూరి మల్లయ్య సంసర్మణ సభ సందర్భంగా 'సంక్షోభంలో మానవ సంబంధాలు' అనే అంశంపై శుక్రవారం మిర్యాలగూడలో నిర్వహించిన సదస్సులో పాల్గొని మాట్లాడారు. విస్తృత సంబంధాలు కలిగి ఉన్న మల్లయ్య.. ఆ సంబంధాలు కనమరుగవుతున్న దశలో మన నుంచి నిష్క్రమించడం దురదృష్టకరమన్నారు.

☛ మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించిన ఎమ్మెల్యే బీఎల్ఆర్.. కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్ర పుస్తకాలను ఆవిష్కరించారు. మాజీ జడ్పీ ఛైర్మన్ సీడీ రవికుమార్, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య, విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, మట్టిమనిషి పాండు రంగారావు, రామయ్య, మల్లయ్య కుమారులు సోమయ్య, సత్యనారాయణ, ప్రభాకర్, వెంకట్, కుమారస్వామి, రవి, బాబా, తిరుమలరావు, ఉదయ, సైదులు పాల్గొన్నారు.

అక్కడ అలా.. ఇక్కడ ఇలా..



కరోనా కాలంలో విద్యార్థులతో కళకళలాడిన సర్కారు బడులు నేడు పిల్లలు లేక వెలవెలబోతున్నాయి. అడవి దేవులపల్లి మండలంలో ఇప్పటికే నడిగడ్డ, నల్లమిట్టతండా, బాలాజీనగర్ తండా, ఇందిరానగర్‌తండాలలో విద్యార్థులు లేక బడులు మూతబడ్డాయి. ఆ లిస్టులో మరో రెండు పాఠశాలలు చేరే పరిస్థితి ఏర్పడింది. శుక్రవారం మండలంలోని బంగారుకుంటతండాలోని ప్రాథమిక పాఠశాలను ఉపాధ్యాయుడు నర్సయ్య ఒక్కరే పాఠశాలలో ఉన్నారు. విద్యార్థుల గురించి వాకబు చేయగా.. పాఠశాలకు తాను డిప్యూటేషన్‌పై వచ్చానని, తాను వచ్చేనాటికి పాఠశాల రికార్డులో ఐదుగురు విద్యార్థులు ఉన్నారని తెలిపారు. వారిలో ముగ్గురు మానసిక దివ్యాంగులని, మరో ఇద్దరు తల్లిదండ్రుల బతుకుదెరువు కోసమని మల్లేపల్లి వెళ్లటం బడి ఖాళీగా ఉందన్నారు. గోన్యాతండాలోను ఇదే పరిస్థితి.. ఒక విద్యార్థి, ఉపాధ్యాయుడు ధరావత్ సైదులు ఉన్నారు. పాఠశాలలలో 8 మంది విద్యార్థులుండగా.. రోజూ తాను ఇంటింటికి తిరిగితే నలుగురు లేక ఐదు మంది విద్యార్థులు హాజరవుతారన్నారని అక్కడి ఉపాధ్యాయుడు తెలిపారు.

– న్యూస్‌టుడే, అడవిదేవులపల్లి



డిండి మండలం గోనకోల్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 10 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు సమయానికి రాకపోవడంతో ప్రధాన గేటు తెరుచుకోక విద్యార్థులు అరగంటకు పైగా ఆరు బయట నిల్చొన్నారు. దీనిపై ఉపాధ్యాయురాలు సుజాతను వివరణ కోరగా.. పని ఉండడంతో సమయానికి రాలేకపోయానని తెలిపారు.

– డిండి, న్యూస్‌టుడే:

వాడివేడిగా పుర పాలకవర్గ సమావేశం


సమస్యల విషయంలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: మిర్యాలగూడ పురపాలిక పాలకవర్గ సమావేశం పుర అధ్యక్షుడు తిరునగరు భార్గవ అధ్యక్షతన ఎనిమిది నెలల తరువాత శుక్రవారం వాడివేడిగా జరిగింది. పాలకవర్గం సభ్యులు ప్రజా సమస్యల విషయంలో ఆయా విభాగాల వారిగా వైద్య, ఆరోగ్య, విద్యుత్తు, పురపాలిక ఇంజినీరింగ్ విభాగాల అధికారుల దృష్టికి తీసుకురాగా ఆయా విభాగాల అధికారులు సమాధానాలు ఇచ్చారు. పట్టణంలో వరద కాలువల్లో వ్యర్థాల తొలగింపునకు పాలకవర్గం ముందస్తుగా తీర్మానించినా సకాలంలో టెండర్లు పిలవకపోవటంతో వర్షాల కారణంగా ముంపు సమస్య తలెత్తిందంటూ పురఅధ్యక్షుడు తిరునగరు భార్గవ డీఈ వెంకన్నను ప్రశ్నించారు. దీనికి డీఈ సమాధానం ఇస్తూ మేలో డ్రైనేజీల్లో వ్యర్థాలు తొలగించాలని జూన్‌లో ఆమోదం తెలిపినందున ఆలస్యం జరిగిందని వివరించారు. ఈ సమయంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు రామకృష్ణ, నర్సిరెడ్డి, జాని, యాదగిరిరెడ్డి, అనిత సహా పలువురు తీవ్ర నిరసన తెలిపారు. భారాస ఫ్లోర్ లీడర్ ఎలియాస్ మాట్లాడుతూ పురపాలిక దుకాణ సముదాయం రెండో అంతస్తు దుకాణాలు అద్దెలకు ఇవ్వకపోవటంతో రూ.కోట్ల ఆదాయం పురపాలిక నష్టపోతుందన్నారు. అనంతరం ఎజెండాలో 2 నుంచి 9 అంశాలు పురపాలిక సిబ్బంది వేతనాల అంశాలను ఆమోదిస్తూ మిగతా అంశాలు తిరస్కరిస్తూ కాంగ్రెస్ కౌన్సిలర్లు సమావేశం నుంచి బయటకు వచ్చారు. అనంతరం పురపాలిక కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

☛ రాజకీయాలు పక్కన పెట్టి పట్టణ అభివృద్ధికి అన్ని వార్డులకు నిధులు కేటాయించాలని కోరుతూ భాజపా పురపాలిక ఫ్లోర్ లీడర్ చిలుకూరి రమాదేవి సమావేశాన్ని బహిష్కరించి నిరసన తెలిపారు.